9

సాక్షి
అనకాపల్లి

శనివారం ౹ 12 ౹ ఏప్రిల్ ౹ 2025

ఆదర్శమూర్తులు

ఆదర్శ దంపతులు వారు.. సమాజానికి ఎనలేని సేవలందించారు.. మహాత్మా జ్యోతిరావు పూలే అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త. ఆయన సతీమణి సావిత్రీబాయి పూలే బాలికా విద్యను ఒక ఉద్యమంగా నడిపారు. జ్యోతిబా పూలే బాలికల కోసం దేశంలోనే తొలి పాఠశాల స్థాపించారు. బుచ్చెయ్యపేట మండలంలోని కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆ పుణ్య దంపతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. వారి కార్యకలాపాలు ప్రతిఫలించేలా నటించి మెప్పించారు. శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా వారిలా నివాళులర్పించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను తల్లిదండ్రులు అభినందించారు.

-బుచ్చెయ్యపేట



జ్యోతిరావు పూలే దంపతుల వేషధారణలో విద్యార్థులు



బాలికలతో అక్షరాలు దిద్దిస్తున్న సావిత్రీబాయి పూలే!



జ్యోతిబా పూలేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహాత్మా జ్యోతిబా పూలేకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు

అనకాపల్లి: సామాజిక సమానత్వం, విద్యా హక్కులు, అణగారిన వర్గాల ఉన్నతి కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వివక్షను అధిగమించి, మహిళా విద్యా ప్రాధాన్యతను సమాజానికి చాటి చెప్పిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు, సీఐలు లక్ష్మణ్‌మూర్తి, టి.లక్ష్మి, రమేష్, గఫూర్, ఎస్‌ఐలు సురేష్‌బాబు, అంజిబాబు, మదీనవల్లి సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ నియామకం

సాక్షి, అనకాపల్లి:

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా చింతకాయల సన్యాసిపాత్రుడు, పొలిమేర పూర్ణచంద్ర గణేష్, పైలా సన్యాసిరాజు, రాజా సాగి సత్యనారాయణ, సేనాపతి కొండలరావు, ప్రధాన కార్యదర్శులుగా పిన్నంరాజు వెంకట దుర్గాప్రసాద్ సన్యాసిరాజు, రుత్తల యర్రాపాత్రుడు, మోపాడ అప్పారావు, ఎస్ఏఎన్ మధువర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుర్ల గిరిబాబు, రుత్తల సత్యనారాయణ, కరణం రమణారావు, రాజాన శ్రీనివాసరావు, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, పచ్చికోరు రమణమూర్తి, పొడగట్ల పాపారావు, దేవరపు వెంకటేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, గొల్లవిల్లి సంజీవరావు, సెక్రటరీ (యాక్టివిటీ)గా కరక అప్పలరాజు నియమితులయ్యారు.

విద్యార్థుల సంఖ్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

అనకాపల్లి టౌన్: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ, హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఎంసీ తీర్మానాలను అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా శాంతిప్రభ



అనకాపల్లి: జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా ఎం.శాంతిప్రభ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ వ్యక్తిగత కారణాల వల్ల మూడువారాలు సెలవుపై వెళ్లడంతో ప్రాంతీయ మలేరియా అధికారిగా విధులు నిర్వహిస్తున్న శాంతిప్రభకు అదనపు బాధ్యతలు ఇప్పగించారు.

ఎనీ టైం మందు

అంతలోనే ఎంత తేడా.. ప్రభుత్వ నిర్వహణలో మద్యం షాపుల నిర్వహణ.. పక్కాగా సమయ పాలన.. నిబంధనల మేరకే విక్రయాలు.. ఇవి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో పాటించిన విలువలు..

మరి ఇప్పుడో.. వెల్లువలా వైన్ షాపులు.. వాటికి గొలుసు దుకాణాలు.. ఎనీ టైం మందు.. ఎమ్మార్పీని మించిన ధర.. ఆలయ సమీపంలోనే విక్రయాలు.. ఇవీ నేటి విచ్చలవిడితనం ప్రతిబింబించే దృశ్యాలు



అచ్యుతాపురంలో రామాలయం ఎదురుగా ఉన్న వైన్ షాపు

- బడి.. గుడి ఉన్నా లెక్క లేదు
- రాబడి ఒక్కటే పరమార్థం
- అచ్యుతాపురంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

అచ్యుతాపురం రూరల్: నిబంధనలు బేఖాతరు చేస్తూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. మందుబాబులు తాగి ఊగుతున్నారు. హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారు. వైన్ షాపులు గుడికి బడికి ఒక్కడో దూరంగా ఉండాలని జీవో ఉన్నప్పటికీ అచ్యుతాపురంలో సీతారాముల ఆలయం ఎదురుగానే ఏర్పాటు చేశారు. విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అదే కాదు మండల కేంద్రంలోని వైన్ షాపులేవీ నిబంధనలు పాటించవు. ఎమ్మార్పీ కంటే పది రూపాయలు అధికంగా తీసుకుంటున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే కొనుగోలుదారులపై విరుచుకుపడుతున్నారు. 21 సంవత్సరాలు దాటిన వారికే మద్యం అమ్మాలని రూల్స్ చెబుతున్నా టీనేజీ దాటని వారికి కూడా యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. రాత్రి 10 గంటలకు దుకాణం మూయాల్సి ఉన్నా అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ నిర్భయంగా విక్రయాలు చేస్తున్నారు. అర్ధరాత్రి దాటినా మందుబాబులు ఇళ్లకు చేరకపోవడంతో ఇంట్లో భార్యాపిల్లలు ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. మద్యం షాపుల వద్దనే మందు బాబులు మద్యం సేవిస్తున్నారు. నిర్వాహకులే గదిని ఏర్పాటు చేసి అక్కడే తాగే విధంగా ప్రోత్సహిస్తున్నారు. మందుబాబులు తాగుతూ ఊగుతూ బాటసారులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలు, చిన్నారులు రోడ్డుపై నడిచి వెళ్లడానికి భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడితనం పెరగడంతో అనవసర వివాదాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి.



షాపు వద్ద బహిరంగ మద్యసేవనం



విద్యుత్ కార్యాలయం ఎదురుగా అధిక ధరకు విక్రయిస్తున్న మద్యం షాపు

కలెక్టర్ దత్తత గ్రామంలో బెల్ట్ షాపు



కలెక్టర్ దత్తత గ్రామంలో అనధికారంగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపు

వ్యాపారస్తులు సిండికేట్లుగా మారి మారుమూల గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మండలంలో ఎం.జగన్నాథపురం గ్రామంలో బెల్టు షాపు ప్రారంభించారు. ఇది కలెక్టర్ విజయ్ కృష్ణన్ దత్తత గ్రామం. బెల్టు షాపు నిర్వహించి గ్రామానికి చెడ్డపేరు తెచ్చే విధంగా కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కలెక్టరే పూనుకొని వీరికి అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు. గ్రామాల్లో మందుబాబులు ఎక్కువైతే శాంతిభద్రతలకు అంతరాయం కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ సీఐ తేజకుమార్‌ని వివరణ కోరగా బెల్టు షాపులు నిర్వహించినా, అధిక ధరలకు విక్రయించినా, సమయం మించి తెరిచి ఉంచినా, మద్యం షాపు వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల కన్నీళ్లు తుడవాల్సింది
పవన్ కల్యాణే..



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

- ఆయన పర్యటన సందర్భంగా పోలీసుల అత్యుత్సాహం
- పరీక్ష రాయలేకపోయిన జేఈఈ మెయిన్స్ విద్యార్థులు
- మోదీ పలుకుబడి ఉపయోగించి న్యాయం చేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

నర్సీపట్నం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా పరీక్షలు రాయకుండా నష్టపోయిన జేఈఈ మెయిన్స్ విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. పోలీసుల అత్యుత్సాహంతోనే వారు పరీక్షకు హాజరు కాలేకపోయారని విమర్శించారు. నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అంటే ప్రధాని నరేంద్ర మోదీకి చాలా ఇష్టం కనుక, ఆయనే జోక్యం చేసుకుని కేంద్ర స్థాయిలో ఒప్పించి 30 మంది విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థుల కన్నీళ్లకు పవన్ కల్యాణే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తున్నామన్నారు. ఆర్థిక నేరస్థులను టెర్రరిస్టుల కంటే ప్రమాదకరమైన వారిగా గుర్తించి దేశానికి రప్పించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక నేరగాళ్లు కాజేసిన రూ.16 లక్షల కోట్లను కక్కించాలన్నారు. బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన 29 మంది ఆర్థిక నేరస్తులు విదేశాల్లో ఉన్నారన్నారు. వీరిలో 25 మంది గుజరాత్ వాళ్లే కావటం గమనార్హమన్నారు. ముంబాయి దాడుల సూత్రధారి రాణాను ఏవిధంగా అయితే తీసుకువచ్చారో.. అదే విధంగా ఆర్థిక నేరగాళ్లను తీసుకురావాలన్నారు. తాను పదేళ్ల క్రితం చింతపల్లి నియోజకవర్గంలో పది రోజుల పాటు పాదయాత్ర చేశానని, ఆ సమయంలో గిరిజనుల ఇబ్బందులను స్వయంగా చూశానన్నారు. రవాణా, వైద్య సదుపాయాలు లేక గిరిజనులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. టూరిస్టులు, కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా కాకుండా గిరిజనులకు మేలు జరగాలన్నారు. పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు రోడ్లు వేయాలన్నారు. వైద్యం, రక్షిత మంచినీటి పథకాలను అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం

మహారాణిపేట (విశాఖ): నగరంలోని కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం జరిగింది. గత పర్యటనలో బాలల హక్కుల కమిషన్ ప్రతిపాదించిన అంశం పట్ల కమిషన్ సభ్యులకు తెలియకుండా జనన, మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. అయితే ఈ విషయాన్ని కమిషన్ సభ్యులకు తెలియజేయకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని, కేజీహెచ్ అధికారులు వ్యవహరించిన తీరు రాజ్యాంగబద్ధమైన కమిషన్ సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కమిషన్‌కు గౌరవం కల్పించడంలో కేజీహెచ్ అధికారులు విఫలమైనట్లు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆక్షేపించారు. కేజీహెచ్ అధికారులు వ్యవహరించిన తీరుపై నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాజ్యాంగ బద్ధమైన కమిషన్ పట్ల కేజీహెచ్ అధికారుల నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. అన్ని ఆస్పత్రుల్ల బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటే కేజీహెచ్‌లో కొత్త రూల్స్ పెట్టడం తమకు ఇబ్బందికరంగా ఉందని సీతారామ్ అన్నారు.

నిలకడలేని సేన

- మలేషియాకు చెక్కేసిన జనసేన కార్పొరేటర్లు
- మాట నిలుపుకోని వైనం
- క్యాంప్ రాజకీయాలు చేయబోమని చెప్పిన మంత్రి నాదెండ్ల
- చెప్పిన నాలుగు రోజుల్లోనే విమానం ఎక్కిన ఏడుగురు జనసేన కార్పొరేటర్లు
- టీడీపీ కార్పొరేటర్లతో కలిసి ప్రయాణం
- ఆదివారం మరికొంత మంది పయనం



మలేషియా విమానం ఎక్కేందుకు కుటుంబ సభ్యులతో సిద్ధంగా ఉన్న టీడీపీ కార్పొరేటర్లు



ఎయిర్‌పోర్టులో జనసేన కార్పొరేటర్‌ను దగ్గరుండి మరీ పంపిస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

విశాఖ సిటీ: యథారాజా తథా ప్రజా అన్న నానుడి జనసేన నేతలకు సరిగ్గా సరిపోతుంది. నిలకడలేని మాటలు, రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలోనే పుట్టాననని.. ఒక్కో సభలో ఒక్కో చదువు చదివానని చెప్పిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో మీమర్లకు ఫుల్‌మీల్స్‌గా మారితే.. ఆ పార్టీ నంబర్-2 నాలుక కూడా నాలుగు రోజుల్లో మడతపెట్టేశారు. విశాఖ మేయర్‌పై అవిశ్వాస ఓటింగ్ వ్యవహారంలో జనసేన క్యాంప్ రాజకీయాలు చేయదని చెప్పిన కొన్ని గంటల్లోనే ఆ పార్టీ కార్పొరేటర్లు విమానమెక్కి చెక్కేయడం గమనార్హం. కార్పొరేటర్లు చేజారిపోతారన్న భయంతో టీడీపీ నేతలే దగ్గరుండి మరీ విమాన టికెట్లు తీయించి మలేషియా విమానం ఎక్కించారు.

నిలకడ లేని మాటలు..

జనసేన పార్టీకి ఓ విధానం, నేతల మాటలకు ఓ నిలకడ లేనట్లు మరోసారి రుజువైంది. అధ్యక్షుడి బాటలోనే కార్పొరేటర్లు నడుస్తూ జిల్లాలో మేయర్ పీఠాన్ని టీడీపీ చేతుల్లో పెట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితమే జనసేన కార్పొరేటర్లు విజయవాడలో పవన్ కల్యాణ్‌ను కలిశారు. అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయాలని హామీ తీసుకున్నారు. తాము క్యాంపు రాజకీయాలు చేయబోమని, తమ కార్పొరేటర్లపై పూర్తి నమ్మకముందని గొప్పలు చెప్పుకొచ్చారు. అది జరిగిన కొద్ది రోజుల్లోనే మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖకు వచ్చి జనసేన కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈయన కూడా క్యాంప్ రాజకీయాలకు జనసేన దూరమని పునరుద్ఘాటించారు. చెప్పిన కొద్ది గంటలకే మాట మార్చారు. అందరినీ విదేశాలకు పంపించాలని నిర్ణయించారు.

ఓటమి భయం

జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించుకోడానికి కూటమి నేతలు కుట్ర రాజకీయాలు తెరతీస్తున్నారు. కౌన్సిల్‌లో బలం పెంచుకోడానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఎర వేస్తున్నారు. లొంగని వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. అయినప్పటికీ.. అవిశ్వాసానికి మద్దతుగా 58 కార్పొరేటర్ల మద్దతు ఉందని కూటమి నేతలు జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఈ నెల 19వ తేదీన అవిశ్వాస ఓటింగ్‌కు ప్రత్యేక కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్పొరేటర్లకు నోటీసులు పంపించారు. ఇదిలా ఉంటే.. కొంత మంది కార్పొరేటర్లు కూటమిలో ఇమడలేక బయటకు వచ్చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ నేతలు ఇప్పటికే కొంత మంది కార్పొరేటర్లను మలేషియా పంపించారు. జనసేన కార్పొరేటర్లు కూడా మనసు మార్చుకోకముందే విదేశాలకు పంపించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఏడుగురు జనసేన కార్పొరేటర్లకు మలేషియా టికెట్ బుక్ చేసి శుక్రవారం సాయంత్రం దగ్గరుండి మరీ విశాఖ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కించారు. ఆదివారం టీడీపీ కార్పొరేటర్లతో కలిపి మిగిలిన జనసేన కార్పొరేటర్లను కూడా మలేషియా పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బాంబు పేల్చిన కూటమి కార్పొరేటర్

ఒకవైపు అవిశ్వాస ఓటింగ్‌కు కార్పొరేటర్లు చేజారిపోకూడదని కూటమి నేతలు క్యాంప్ రాజకీయాలు చేస్తుంటే.. మరోవైపు అదే కూటమికి చెందిన 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బాంబు పేల్చారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నట్లు 58 మంది సంతకాలు చేసినట్లు కలెక్టర్ నోటీసులో పేర్కొని, ఆ తీర్మానం కాపీని సభ్యులకు అందించలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. కలెక్టర్ కార్పొరేటర్లకు ఇచ్చిన ఫారం-2 నోటీసులో 58 మంది సభ్యులు సంతకం చేసిన ప్రతిపాదిత అవిశ్వాస తీర్మానం కాపీని జత చేసినట్లు చెప్పారని, కానీ అటువంటి మోషన్ కాపీ జత చేయలేదని అభ్యంతరం తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి సంతకం చేసిన 58 మంది సభ్యుల సంతకాల ఆధారాలు సమర్పించని పక్షంలో ఆ నోటీసు 1955 మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం ఎవరైనా ప్రశ్నిస్తే కోర్టు ముందు నిలబడకపోవచ్చన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలో పేర్కొన్న విధానాన్ని అనుసరించి పునఃపరిశీలించాలని కోరారు. అవిశ్వాస ఓటింగ్ ప్రక్రియలో చట్టపరమైన సమస్యలకు అవకాశం ఇవ్వకుండా ప్రత్యేక సమావేశాన్ని సరైన పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పత్రికా స్వేచ్ఛకు విఘాతం

సాక్షిపై కేసుల్ని ఖండించిన పాత్రికేయులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సాక్షి సిబ్బంది



అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సీతమ్మధార (విశాఖ):

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, మరో ఆరుగురు రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని కోరుతూ విశాఖలోని జీవీఎంసీ గాంధీ పార్కులో సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రిక బ్యూరోచీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సాక్షి దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సాక్షి అనకాపల్లి, అల్లూరి జిల్లాల డెస్క్ ఇన్‌చార్జి బీబీ సాగర్ మాట్లాడుతూ సాక్షి ఎడిటర్‌తో సహా ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు విఘాతమన్నారు. ఒక హత్యకేసులో బాధితుల పక్షాన నిలిచి వాస్తవాలు వెలికితీయడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. వార్తలో పేర్కొన్న విషయాల్లో నిజనిజాలను ఖరారు చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడం మాని, పాత్రికేయులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జర్నలిస్టులంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటీ రామునాయుడు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో జరిగిన హత్యోదంతంలో దోషులను శిక్షించాల్సింది పోయి, వార్త కవర్‌చేసిన సాక్షి మీడియా జర్నలిస్టులపైనా, మీడియాపైనా కేసులు నమోదుచేయడం సరికాదన్నారు. సాక్షి ఎడిటర్‌తో పాటు ఇద్దరు జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వార్త కవర్ చేసిన సాక్షి మీడియా జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. సీనియర్ జర్నలిస్టు పిల్లా విజయకుమార్ మాట్లాడుతూ యాజమాన్యాల మీద ఉన్న కోపాన్ని వృత్తి ధర్మం నిర్వహిస్తున పాత్రికేయులపై ప్రదర్శించడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు అనేష్ కుమార్, ఏపీడబ్ల్యూజే అనుబంధ సామ్నా జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణకిశోర్, భీమిలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణప్రసాద్, పలు ప్రెస్‌క్లబ్‌ల కార్యవర్గసభ్యులు, అధిక సంఖ్యలో పలు మీడియాలకు చెందిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి: పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ప్రభుత్వం తీసుకున్న మొండి వైఖరిని తక్షణమే విడనాడాలని అనకాపల్లి ప్రెస్‌క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే) నియోజకవర్గ అధ్యక్షుడు మళ్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి గణేష్‌లు అన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఆరుగురు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ క్రిమినల్ కేసులను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి, ఏవో బి.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరిగే అక్రమాలు, అన్యాయాలను పత్రికలు వెలికితీస్తాయని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పి.వీరబాబు, బి.మధుసూదనరావు, మంత్రి నారాయణమూర్తి, వేగి రామచంద్రరావు, కర్రి గంగాధర్, కోన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 20 లక్షల బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కు అందిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ శివారు చిన గంగవరానికి చెందిన కోలా జోగిబాబు ఇటీవల మరణించడంతో దేవరాపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ), ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్(ప్రమాద బీమా) కింద రూ.20 లక్షలు మంజూరైంది. ఈ మేరకు స్థానిక ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో రీజనల్ మేనేజర్ పి.చిరంజీవి వెంకటేష్, ఇతర బ్యాంక్ అధికారుల చేతుల మీదుగా రూ. 20 లక్షల ప్రమాద బీమా చెక్కును నామినీగా ఉన్న మృతుడి భార్య కోలా మణికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్య, జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్, ఎంవీ రమణయ్య, నోడల్ అధికారి ఎస్.కె.సనవాజ్, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఒకవేళ ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకుని, టార్పాలిన్ కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. రాగి పైరు కోతలు కూడా వాయిదా వేసుకోవాలన్నారు. ఒక వేళ ఇప్పటికే కోసి ఉంటే నీడగా ఉన్న స్థలంలో ఆరబెట్టుకోవాలన్నారు. నువ్వు పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్‌ను లీటరు నీటికి 3 గ్రా.ల చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పోషక విలువలున్న చెరకు చెత్తను పొలంలో పరచుకొని సద్వినియోగం చేసుకోవాలని, 45 రోజులు, 90 రోజులు వయసు గల చెరకు మొక్క తోటల్లో రాగల వర్షాన్ని ఉపయోగించుకుని ఎకరాకు 75 కిలోల యూరియాను మొక్కల మొదల్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన అరటి గెలలను వీలైనంత త్వరగా కోసి మార్కెట్‌కు తరలించాలని సూచించారు. గాలులకు పడిపోకుండా ఇంకా పక్వానికి రాణి అరటి గెలలకు ఊతమివ్వాలని, రాగల వర్షాన్ని వినియోగించుకుని ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవిలో దుక్కులు దున్నుకోవాలన్నారు.

- ఆరుగాలం శ్రమించిన రైతుల ఆశలు ఆవిరి
- ఈదురు గాలులతో అపార నష్టం
- నేలమట్టమైన అరటి, అగర్‌వుడ్, జీడి తోటలు

వర్ష బీభత్సం.. అరటి తోటలు ధ్వంసం



తిమిరాంలో విరిగిన అగర్‌వుడ్ మొక్కలు

దేవరాపల్లి: జిల్లాలో రెండు రోజులుగా పెనుగాలులతో కురిసిన వర్షాలకు అరటితోటలు ధ్వంసమయ్యాయి. దేవరాపల్లి మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. భారీగా వీచిన ఈదురు గాలుల ధాటికి తిమిరాం గ్రామానికి చెందిన రెడ్డి సింహాద్రప్పడు, కామిరెడ్డి శ్రీరామమూర్తి, రెడ్డి సత్యనారాయణ తదితరులకు చెందిన సుమారు 8 ఎకరాలలో ఏడేళ్ల క్రితం అగర్‌వుడ్ సాగు చేస్తున్నారు. దీనిలో అంతర పంటగా కడియం నుంచి తీసుకువచ్చిన అరటి మొక్కలు నాటారు. అరటి తోట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో లాభాలు వస్తాయని ఆశపడిన రైతులకు అకాల వర్షాలు నిరాశ మిగిల్చాయి. ఈ నెల నుంచి అరటి గెలల విక్రయాలు ద్వారా వారానికి రూ.5వేలు పైగా ఆదాయం వచ్చేది. గురువారం సాయంత్రం ఈదురుగాలుల ధాటికి అరటి తోటతో పాటు ఏడేళ్లగా కష్టపడి పెంచిన అగర్‌వుడ్ చెట్లు సైతం విరిగిపోయాయి. ఐదెకరాల్లో అరటి తోట, సుమారు 1500 వరకు అగర్‌వుడ్ మొక్కలు నేల కూలాయని బాధిత రైతు రెడ్డి సింహాద్రప్పుడు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2 ఎకరాలలో సాగు చేసిన అరటి, అగర్‌వుడ్ తోటలు ధ్వంసమయ్యాయని రైతు కామిరెడ్డి శ్రీరాములు తెలిపారు. మరో రైతు రెడ్డి సత్యనారాయణకు చెందిన 50 సెంట్లలో అరటి తోట ధ్వంసమైంది. ప్రభుత్వం వెంటనే ఆదుకొని పంట నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు. రైతుల సమాచారం మేరకు నేలమట్టమైన అరటి తోటలను పరిశీలించామని మామిడిపల్లి సచివాలయ వ్యవసాయ సహాయకురాలు రామలక్ష్మి తెలిపారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.



చమ్మచింతలో విరిగిన అరటి చెట్ల గెలలను ఉద్యాన వన శాఖాధికారికి చూపిస్తున్న రైతు

రైతులపై ప్రకృతి కన్నెర్ర

నాతవరం: ఈదురు గాలులతో కురిసిన ఆకాల వర్షానికి జీడి మామిడి తోటలతో పాటు అరటి తోటలకు తీవ్ర నష్టం కలిగింది. మండలంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో పాటు భారీ వర్షం పడడంతో జీడి పిక్కలు, మామిడి కాయలు చాలా చోట్ల నేలకొరిగాయి. చమ్మచింత, వల్సంపేట, మాధవనగరం, నాతవరం, గుమ్మడిగొండ, వెదురుపల్లి, సరుగుడు, పెదగొలుగొండపేట, చినగొలుగొండపేట గ్రామాల్లో రైతులు అరటి తోటలు సాగు చేస్తున్నారు. అరటి తోటలు కాపు ముమ్మరంగా కాసి ప్రస్తుతం విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పంట చేతికంది వచ్చే సమయంలో అరటి రైతులపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 10 ఎకరాలకు పైగా అరటి తోటలు ఈదురు గాలలకు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. చాలా గ్రామాల్లో రైతులు పామాయిల్ తోటలో అంతర పంటగా అరటి తోటలు పెంచుతున్నారు. గాలులకు దెబ్బతిన్న అరటి తోటలను శుక్రవారం ఆయా గ్రామాల రైతులు ఉద్యావన వ్యవసాయశాఖాధికారులను తీసుకెళ్లి స్వయంగా చూపించారు. అరటి తోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న తోటలపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని నాతవరం గ్రామ సచివాలయ ఉద్యాన వనశాఖాధికారి రవితేజ తెలిపారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చేలా

‘స్వర్ణాంధ్ర 2047 విజన్’

- విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



టీచర్ రోడ్డు (విశాఖ): క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని.. నియోజకవర్గ స్థాయి 2047 విజన్ ప్రణాళికలు రూపొందించాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మే 15 నాటికి అన్ని పనులను పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాల అధికారులకు వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి అంశాలను అవగతం చేసుకుంటూ.. ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల పరిధిలో పనిచేయాల్సిన అధికారుల బృందాలను ప్రకటించారు. జిల్లాకు కలెక్టర్ చైర్మన్‌గా, నియోజకవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, ఆయా జోనల్ లేదా మండల స్థాయిలో జోనల్ కమిషనర్, ఎంపీడీవోలు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని, ఒక్కో కమిటీలో ఐదుగురు సచివాలయ సిబ్బంది ఉంటారని ఆయన వెల్లడించారు. వీరంతా కలిసి స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికకు అనుగుణంగా తాత్కాలిక వార్షిక ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజల అవసరాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలని, భవిష్యత్ రూపురేఖలు మార్చే విధంగా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి, మూడు జిల్లాల ఉన్నత స్థాయి అధికారులు, ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రణాళిక విభాగం అధికారులు, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తరహాలో పాయకరావుపేట అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట: రానున్న పదేళ్లలో పాయకరావుపేటను విశాఖ, గాజువాక తరహాలో అభివృద్ధి చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పాయకరావుపేటలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆమె శుక్రవారం నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో అత్యధిక వనరులు ఉన్న నియోజకవర్గం పాయకరావుపేట అని చెప్పారు. నియోజకవర్గానికి బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ వంటి ప్రధాన పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. గత ఐదేళ్ల పాలనను ఆమె విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును జీవనాడిగా పేర్కొంటూ పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. త్వరలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

హోమ్ మంత్రి విలేజ్ వాక్

నక్కపల్లి: మండలంలోని వేంపాడులో శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విలేజ్ వాక్ నిర్వహించారు. ఉదయాన్నే ఆమె గ్రామంలో పలు వీధుల్లో పర్యటించారు. స్వయంగా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు తాగునీరు, కాలువలు, రోడ్ల సమస్యలను వివరించారు. తాగునీటి ఎద్దడి ఉందని పరిష్కరించాలని కోరారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

బీసీ కార్పొరేషన్ రుణాల్లో

అర్హులకు మొండిచేయి

- పైరవీరులకే పెద్దపీట
- మండిపడుతున్న దరఖాస్తుదారులు

బుచ్చెయ్యపేట: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో అర్హులకు మొండిచేయి చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తమ అనుచరులకే తప్ప మిగతా వారికి రుణాలు మంజూరు కాకుండా కూటమి నాయకులు చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైరవీరులకే రుణాలు దక్కేలా మండల నాయకులు చక్రం తిప్పుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆటో, ట్రాక్టర్, బుక్ స్టాల్, కిరాణా తదితర యూనిట్ల కోసం రూ.5 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యూనిట్ ధరను లక్షన్నర వరకే రుణ సదుపాయం కలిగేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 119 యూనిట్లు మంజూరు చేసింది. బుచ్చెయ్యపేట మండలంలో 610 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులు కన్నా కూటమి నేతలు తమ అనుయాయులకే రుణాలు దక్కేలా పావులు కదుపుతున్నారు. యూనిట్ విలువ తగ్గించడం వల్ల రెండున్నర లక్షల సబ్సిడీ అందాల్సి ఉండగా.. రూ.75 వేలే సబ్సిడీ అందుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా.. పెద్ద రుణాలు కాకుండా చిన్న రుణాల కోసం 94 మంది పేర్లను బ్యాంకులకు పంపించామని, బ్యాంకుల నుంచి విల్లింగ్ వచ్చిన తరవాత బీసీ కార్పొరేషన్‌కు లబ్ధిదారుల పేర్లను పంపిస్తామన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి అనుమానాస్పద మృతి



నాగేశ్వరావు మృతదేహం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడని పరిశ్రమ యాజమాన్యం చెబుతుండగా, విష వాయువులు పీల్చడం వల్లే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వివరాలివి. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన బావురిశెట్టి నాగేశ్వరరావు(55) గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో మూడేళ్లుగా క్లీనింగ్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం క్లీనింగ్ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. తోటి కార్మికులు ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యానికి తెలియజేయగా, నాగేశ్వరరావును వైద్య పరీక్షల నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఒక అమ్మాయికి వివాహం అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు కింద నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా.. కాంట్రాక్టు కార్మికుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

విశాఖ-తిరుపతికి ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-తిరుపతి(08547) వీక్లీ స్పెషల్ ప్రతీ బుధవారం రాత్రి 7గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుపతి-విశాఖపట్నం(08548)స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 29వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం-కర్నూలు సిటీ(08545) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.35 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 27 వరకు నడుస్తుంది. కర్నూలు సిటీ-విశాఖపట్నం(08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మే 28 వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు(08581) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 25వ తేదీ వరకు నడుస్తుంది. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం (08582) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మురుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 26వ తేదీ వరకు నడుస్తుంది.

జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థిని ప్రతిభ

విశాఖ విద్య: జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో ఏయూ తత్వశాస్త్ర విభాగం మొదటి సంవత్సరం విద్యార్థిని కోన మహాలక్ష్మి రెండో బహుమతిని గెలుచుకున్నారు. కర్ణాటక రాష్ట్రం ధార్వాడకు చెందిన సెంటర్ ఫర్ మల్టీ డిసిప్లినరీ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఈ పోటీలు నిర్వహించింది. ధార్వాడలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య బసవ ప్రభు జిర్లి చేతుల మీదుగా మహాలక్ష్మికి రూ.7 వేలు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

- ఒకరు పరారీ
- లిక్విడ్ గంజాయి స్వాధీనం



నలుగురు గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్ఐలు

నర్సీపట్నం: లిక్విడ్ గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో కె.డి.పేట, గొలుగొండ ఎస్ఐలు తారకేశ్వరరావు, రామారావు, ఏఆర్ ఎస్ఐ వెంకటరావు, స్పెషల్ పార్టీ పోలీసులు శుక్రవారం కేడీ పేట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కారులో లిక్విడ్ గంజాయి తీసుకువెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. కడప జిల్లా కోరుమిల్లి మండలం, గిరినగర్ గ్రామానికి చెందిన చాటకుండు గురయ్యను అరెస్ట్ చేశారు. ఇతను పలు కేసుల్లో నిందితుడు. ఈయనపై బద్వేల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందని డీఎస్పీ తెలిపారు. అదే జిల్లాకు చెందిన నాగడసారి కేశవ గంజాయి రవాణాకు సహకరించాడు. అక్కిదాసరి శ్రీహరి టూరిజం ట్రిప్ పేరుతో అద్దెకు కారు తీసుకున్నాడు. జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీ వంతడపల్లికి చెందిన ముర్ల చంటిబాబును అరెస్ట్ చేశారు. ఈయన కూడా పాత కేసుల్లో నిందితుడు. గంజాయి రవాణాకు కీలకంగా వ్యవహరించిన వ్యక్తి పరారులో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. చాటగుంట యరయ్య, చంటిబాబు కడప జిల్లా బద్వేల్ జైల్‌లో గంజాయి కేసులో ముద్దాయిలుగా ఉన్నప్పుడు పరిచయం ఏర్పడింది. వీరిద్దరు ఇటీవల జైల్ నుంచి విడుదలయ్యారు. చంటిబాబుకు స్నేహితులైన కేశవ, అక్కిదాసరి శ్రీహరి లిక్విడ్ గంజాయి వ్యాపారం చేసేందుకు మాట్లాడుకున్నారు.

ఒడిశా సరిహద్దులో లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేశారు. నలుగురూ లిక్విడ్ గంజాయిని కారు డోర్‌లో పెట్టి రవాణా చేస్తున్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో గంజాయి దొరికిందని డీఎస్పీ తెలిపారు. కిలో లిక్విడ్ గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. రవాణాకు ఉపయోగించిన టయోటా కారును పోలీసులు సీజ్ చేశారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

తామరబ్బలో అదుపు తప్పి ఆటో బోల్తా



తామరబ్బలో నుజ్జు అయిన ఆటో (ఇన్‌సెట్)ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- డ్రైవర్, ఓ మహిళకు తీవ్ర గాయాలు
- మిగతా మహిళలకు స్వల్ప గాయాలు
- క్షతగాత్రులంతా రైవాడ గ్రామస్తులు

దేవరాపల్లి: మండలంలోని తామరబ్బ సమీపంలో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఓ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సహా ఒక మహిళకు తీవ్ర గాయాలు కాగా.. పలువురు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 20 మంది వరకు మహిళా ప్రయాణికులు ఉన్నారు. క్షతగాత్రుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సమ్మెద సమీపంలో జీడి తోటల్లో జీడి పిక్కలు సేకరించేందుకు(ఏరడానికి) రైవాడ గ్రామానికి చెందిన 20 మంది మహిళలు ప్రతి రోజూ కూలీ పని కోసం ఆటోలో వెళ్లి వస్తుంటారు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకొని ఇంటికి ఆటోలో బయలుదేరారు. తామరబ్బ వంతెన సమీపంలో ప్రమాదకర మలుపులో ఎత్తుగా ఉన్న రోడ్డు ఎక్కలేక ఆటో అదుపు తప్పి వెనక్కి వెళ్లిపోతూ పక్కనే ఉన్న బండరాయిపై బోల్తా పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు వెంటనే వారిని రక్షించి వేరొక ఆటోలో దేవరాపల్లి పంపించారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కోరి అప్పలరాజు, శీర సింహాచలమ్మ చేతులు విరిగాయి. వంకల అప్పలనర్స, మంగ, లక్ష్మి, దుక్క అప్పలనర్స, నర్సమ్మ, చిన్న, సన్నమ్మ తదితరులు గాయపడ్డారు. వీరికి దేవరాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు.

నేడు శ్రీవారి లడ్డూల విక్రయాలు నిలిపివేత

కొమ్మాది: రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి లడ్డూల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటిమెట్టలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి శ్రీవారి లడ్డూలు పంపిన నేపథ్యంలో ఇక్కడ విక్రయాలు నిలిపివేశామని, ఇది భక్తులు గమనించాలని కోరారు.

దోపిడీకి పాల్పడిన బాలుడి అరెస్ట్

- ర్యాపిడో డ్రైవర్‌పై దాడి ఘటన



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ లతామాధురి

ఉక్కునగరం: ర్యాపిడో డ్రైవర్‌పై దాడి చేసి దోపిడీకి పాల్పడిన బాలుడిని అరెస్ట్ చేసినట్లు నగర క్రైం డీసీపీ కె.లతా మాధురి తెలిపారు. ఈ నెల 10న స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ రహదారిలో ర్యాపిడో డ్రైవర్‌పై మైనర్ దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. గాజువాక సౌత్ ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసు వివరాలు వెల్లడించారు. పార్ట్‌టైం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న కిశోర్ ఆ రోజు రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా శ్రీనగర్ పెట్రోల్ బంక్ వద్ద బాలుడు స్టీల్‌ప్లాంట్ లోపలికి రైడ్ మాట్లాడుకున్నాడు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్మశానం వద్ద బైక్ ఆపమని చెప్పి, ఆ బాలుడు కిశోర్‌పై దాడి చేసి ఫోన్ లాక్కున్నాడు. ఆ ఫోన్ ద్వారా ముగ్గురికి రూ.48,100 ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో క్రైం సిబ్బంది వెంటనే అప్రమత్తమై దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో పెదగంట్యాడ సమతా నగర్‌లోని సాయిబాబా గుడి దగ్గరలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరాన్ని అంగీకరించిన బాలుడి నుంచి రూ.48,100 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై.. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో బాలుడు దోపిడీకి పాల్పడినట్లు డీసీపీ తెలిపారు. డెలివరీ బాయ్స్, ర్యాపిడో, ఓలా తదితర డ్రైవర్లు రాత్రి సమయాల్లో అపరిచితులను నమ్మి లిఫ్ట్ ఇవ్వొద్దని సూచించారు. ఈ సందర్భంగా బాలుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈ నెల 24 వరకు రిమాండ్ విధించారు. అనంతరం అతన్ని జువనైల్ హోమ్‌కు తరలించినట్లు క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో ఏడీసీపీ క్రైం మోహనరావు, ఏసీపీ జోన్-2 క్రైం డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆడపిల్లల రక్షణపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

అనకాపల్లి టౌన్: మండలంలోని **తుమ్మపాల** జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు **గుడ్ టచ్, బ్యాడ్ టచ్**లపై అవగాహన **కల్పించారు**. ఈ సందర్భంగా రూరల్ ఏఎస్ఐ ఎన్ మణికుమారి మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్న విషయాలను కూడా తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి. బలరాంస్వామి తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్య విత్తనాలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట: ప్రకృతి వ్యవసాయం సాగు చేసే గ్రామాల్లో తొలకరి వర్షాలు పడకముందే నవ ధాన్య విత్తనాలు నాటుకోవడానికి రైతులకు అవగాహన కలిగించాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న కోరారు. మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంకా మొదలు పెట్టని గ్రామాల్లో ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 35 మంది రైతులతో నవ ధాన్య విత్తనాలు నాటించాలన్నారు. ఏడాది పొడవున భూమి ఖాళీ ఉండకుండా పచ్చని పంటలతో నిండి ఉండాలన్నారు. దీనివల్ల భూమిలో సూక్ష్మ జీవులు, రైతు నేస్తాలైన వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. నవ ధాన్యాలు నాటడం వల్ల భూమి సారవంతం అవుతుందని, అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ విషయాలను రైతులకు అవగాహన కలిగించాలన్నారు. పిల్లి పెసర, మినుము, జీలుగ, కట్టి జనుము విత్తనాల కోసం రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏఈవో శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జి ఆర్. సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

కందిపప్పు పంపిణీ చేయకపోవడం అన్యాయం

అనకాపల్లి: జిల్లాలో రేషన్ కార్డుదారులకు మూడు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమది మంచి ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు కందిపప్పు నిలిపివేతపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెరగడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం తరహాలో కూటమి ప్రభుత్వం మన రాష్ట్రంలో రేషన్ డిపోల ద్వారా 14 రకాలైన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 2,499 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,680	4,410
రెండో రకం	3,150	3,810
మూడోరకం	3,040	3,140

అనకాపల్లి సినిమాలు

రాజా : మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్–1 : గుడ్‌బ్యాడ్ అగ్లీ
సత్యనారాయణ స్క్రీన్–2 :రాజుగారి దొంగలు
పర్మిసాయి : కోర్టు
షిర్డీసాయి: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : చెరసాల
శ్రీసత్య : సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-06 యూనిట్లు, బీ పాజిటివ్-09 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు ఏబీ పాజిటివ్-02 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

చెరువు గట్టు.. వివాదాల తుట్టు

- కారిబంద గట్టు ఏర్పాటుతో పొలాలకు ముంపు
- పనులు మొదలెట్టిన దిబ్బపాలెం ఉపాధి కూలీలు
- ఊడేరు, అల్లికండుపాలెం గ్రామాల రైతుల ఆందోళన
- అధికారుల తీరుపై ఆగ్రహం


కారిబంద చెరువుకు ఆనుకుని ఊడేరు, అల్లికండుపాలెం కారి పొలాలు

తుమ్మపాల: కారిబంద చెరువు గట్టు మూడు గ్రామాల రైతుల మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ చెరువులో చేపల పెంపకం కోసం వేతనదారులకు ఉపాధి హామీ పనుల కల్పన కోసం అధికారులు గట్టు ఏర్పాటు చేస్తుండటంతో తమ పొలాలు ముంపునకు గురవుతాయని ఊడేరు, అల్లికండుపాలెం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గట్టు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని నిరసనకు దిగారు.

మండలంలో ఊడేరు రెవెన్యూ పరిధిలో కారి**బంద చెరువుకు ఆనుకుని ఎగువ భాగాన** ఊడేరు, అల్లిఖండుపాలెం గ్రామాల కారి భూములు దాదాపు వందెకరాల వరకు ఉన్నాయి. ఈ భూములే జీవనాధారంగా రెండు గ్రామాల ప్రజలు వరి, చెరకు పండిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి వాగులు, కొండలు, వంకల నుంచి వర్షపు నీటితో పాటు వరద నీరు వచ్చి ఈ చెరువులో చేరుతోంది. దాంతో ముంపు సమస్య లేదు. కారిబంద చెరువుకు రెండు పక్కల మాత్రమే గట్టు ఉంది. మిగిలిన భాగం మీదుగానే కారి భూముల్లో ముంపు నీరు దిగువకు చేరుతోంది. అయితే కారిబంద చెరువుపై అన్ని హక్కులు దిబ్బపాలేనికి ఉన్నాయి. దాంతో ఆ గ్రామ ఉపాధి కూలీలు చేపల పెంపకం నిమిత్తం చెరువు గర్భంలో తవ్వి గట్టు ఏర్పాటుకు సిద్ధపడ్డారు.

గట్టు వద్దంటున్న ఊడేరు రైతులు

దిబ్బపాలెంలో చెరువులు, వాగుల్లో పూడికతీత పూర్తవడంతోపాటు గ్రామానికి అభివృద్ధి వనరుగా ఫిష్ పాండ్ నిర్మాణం కోసం చేపట్టిన పనుల్లో కారిబంద చెరువును తవ్వినప్పటికి గట్టు వేయొద్దంటూ రైతులు అభ్యంతరం చెబుతున్నారు. కారి భూమి పొలాలకు ఆనుకుని కారిబంద చెరువు ఉండటం, పొలాలకు అడ్డంగా గట్టు వేస్తే నీటి ప్రవాహం నిలిచిపోయి పంట ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభించిన పనులను తక్షణమే నిలిపివేయాలంటూ పాలకులను, అధికారులను కోరుతున్నారు.


కారిబంద వద్ద గట్టు వద్దంటూ రైతుల ఆందోళన

కారిబంద చెరువుకు గట్టేస్తే పొలాలకు ముంపే...



ఊడేరు, అల్లిఖండుపాలెం గ్రామాల మధ్య వందెకరాల ఆయకట్టు భూమి ఉంది. కారి పొలాల్లో నాతో పాటు మా కుటుంబానికి పదెకరాల పల్లపు భూమి ఉంది. వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు ఎగువ నుంచి వచ్చిన నీరు మా పొలాల మీదుగా కారిబందలోకి పోతోంది. ఇప్పుడు కారిబందలో చేపల పెంపకం కోసం గట్టు వేస్తే మా పొలాలన్నీ ముంపు బారిన పడతాయి.

– సిరసపల్లి నర్సింగరావు, రైతు, ఊడేరు గ్రామం

గట్టేస్తే నీరెలా పోయేది



కారిబంద చెరువులోకి పొలాల్లోంచి నీరు పోయే చోట చేపల పెంపకం కోసం పనులు పెట్టడం అధికారుల అవగాహన లోపమే. చెరువును తవ్వి ఉన్న గట్టును వేస్తే పర్వాలేదు. కాని కొత్తగా లేనిచోట పొలాలకు అడ్డంగా గట్టేస్తే ముంపు తప్ప పంట మిగిలే అవకాశమే లేదు. గ్రామంలో వ్యవసాయ పల్లపు భూములు, సాగు నీటి ప్రవాహ పరిస్థితులపై తెలుసుకోకుండా ఉపాధి పనులు చేపట్టడం సరైన విధానం కాదు.

– పప్పల రాజు, రైతు, ఊడూరు గ్రామం

బొజ్జన్నకొండను కప్పేస్తున్న పిచ్చిమొక్కలు


ఏపుగా మొక్కలు పెరగడంతో కనిపించని బొజ్జన్న కొండ

అనకాపల్లి టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి విష సర్పాలు, క్రిమి కీటకాల నుంచి పర్యాటకులను కాపాడాలని తుమ్మపాల గ్రామస్తులు వి. అప్పారావు, ఎస్. చిరంజీవి, కె. రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. చుట్టూ మొక్కలు పెరిగి పరిసర ప్రాంతమంతా అడవిని తలపిస్తుందన్నారు. కింద నుంచి చూస్తే కొండ మీద బుద్ధుని రాతి విగ్రహం కనిపించడంలేదన్నారు. ఈ ప్రాంతం గుండా రోజూ వందలాది క్వారీ లారీలు అధిక లోడ్‌లతో ప్రయాణించడం వల్ల రోడ్ పాడై పోతోందని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్‌పై వేధింపులు ఆపాలి'

అనకాపల్లి టౌన్: ల్యాబ్ టెక్నీషియన్ రసూల్‌పై వేధింపులు ఆపాలని ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గీతారాణి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ రసూల్‌కు 18 నెలలుగా జీతం పెండింగ్‌లో ఉందన్నారు. దీనివల్ల అతడి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

చట్ట సభల్లో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

బీఎస్పీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి కరణం తిరుపతిరావు


బీసీ సమరభేరి కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు

అనకాపల్లి టౌన్: బీసీలకు చట్ట సభలలో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బీఎస్పీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి కరణం తిరుపతిరావు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో శుక్రవారం బీసీ సమరభేరి కార్యక్రమం జరిగింది. ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులాల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూది కొండ మాణిక్యాలరావు, జిల్లా అధ్యక్షుడు బొట్టా నాగరాజు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ్, రైతు సంఘం సీనియర్ నేత కోరిబిల్లి శంకర్రావు, ఎస్‌వీపీ రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు అన్సర్ మద్‌ని ఔలియా ఉరుసు


బయ్యవరం వద్ద వెలసిన హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గా


దర్గాలో మద్‌ని ఔలియా సమాధి

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామం వద్ద వెలసిన హజరత్ అన్సర్ మద్‌ని ఔలియాల దర్గా ఉరుసు (చందనోత్సవం) శనివారం పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు టాటా నగర్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు ఎక్కువగా హాజరవుతారు. ఔలియా సమాధికి చందనం పూసి సంప్రదాయంగా చాదర్లు కప్పి పూలు జల్లి, తీపి పదార్థాలను ప్రసాదంగా నివేదించి పూజిస్తారు. దర్గా ప్రాంతంలో తీర్థం మహోత్సవం జరుగుతుంది. కవ్వాలి ఉర్దూ భక్తి పాటల పోటీ జరుగుతుంది. ఆకాశ చక్రాలు, మహిళల అలంకరణ వస్తువులు, తినుబండారాలు, చెరకు గడలు, పండ్లు వగైరా అమ్మకాలు ఎక్కువగా సాగుతాయి. ఉత్సవం శనివారం ఉదయం గుసుల్ షరీఫ్ (చందనం పూయుట) ప్రారంభమవుతుందని దర్గా కమిటీ ముతవల్లి అబ్దుల్ మాకీం, కార్యదర్శి ఎండీ ఆయాజ్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఫాతెహా అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. రాత్రి 10 గంటలకు విశాఖలోని ఆషిక్ బృందంతో ఖవ్వాలి పాటల పోటీ జరగనుందన్నారు. ఉత్సవం సందర్భంగా దర్గాను అందంగా రంగులు వేశారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. దర్గా ప్రాంగణంలో విద్యుద్దీపాలు, కటౌట్లను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు.

మారేపల్లి సర్వేయర్ మురళికి ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్వేయర్ మురళి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి సచివాలయంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.మురళి ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరం జీవీఎంసీ సమావేశ మందిరంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజా, రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్. చిరంజీవి, అనకాపల్లి డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ సర్వేయర్ అవార్డును అందుకున్న మురళిని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, వీఆర్‌వోలు అభినందించారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిబా పూలే


జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న హరనాథ్ బాబు


బాలుర వసతి గృహం వద్ద జ్యోతిబా పూలే జయంతి వేడుకలు


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

అనకాపల్లి టౌన్: పేదలు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఏకైక మార్గం చదువేనని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు తెలిపారు. పట్టణంలోని నెహ్రూచౌక్ జంక్షన్‌లో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు. ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో జరిగిన వేడుకలలో ఓబీసీ అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి ఆడారి కుమారస్వామి మాట్లాడుతూ సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే బీసీలకు ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు దాడి బుజ్జి, బొబ్బిలి సురేష్, ఆడారి రాజు, బొడ్డేడ ఈశ్వర్, మళ్ల బోగలింగం, పీ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు. నెహ్రూచౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దూలం బూసిరాజు, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దళిత, బహుజన, మహిళా వర్గాల అభ్యున్నతి కోసం పూలే కార్యాచరణ మహోన్నతమైనదన్నారు. ఈ కార్యక్రమంలో బండి అప్పారావు, కాండ్రేగుల సరేశ్వరరావు, కాండ్రేగుల శంకర్, కోనపల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు పెదపాటి కల్యాణి నివాళులర్పించారు. అంటరానితనం, కుల వివక్ష రూపుమాపడానికి, బాలిక విద్య స్థాపనకు పిడికిలి బిగించిన పోరాట యోధుడు పూలే అని ప్రస్తుతించారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సనాతన క్షాత్రం


పంచామృత అభిషేకాలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక జాతర సందర్భంగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 13న నిర్వహించే సనాతన క్షాత్రం అనే ఆధ్యాత్మిక పవచన పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మళ్ల సురేంద్ర, జనసేన పార్టీ నాయకులు దూలం గోపి, చదరం నాగేశ్వరరావు, మంగ ఈశ్వర్, గంగుపాం జగదీష్, కోన వాసు తదితరులు పాల్గొన్నారు.

పంచామృత అభిషేకాలు

స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్లబాబు), భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో విద్యార్థులకు నష్టం


ఎమ్మెల్యే రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్

అనకాపల్లి: విద్యా శాఖ త్వరలో చేపట్టే పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో విద్యార్థులు నష్టపోతారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సంస్కరణల పేరుతో పాఠశాలలతోపాటు ఉపాధ్యాయ పోస్టులు కుదించొద్దన్నారు. ఒక పంచాయతీలో ఎన్ని పాఠశాలలుంటే అన్నింటిని ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలన్నారు. 40 మంది విద్యార్థుల కంటే ఎక్కువ మంది ఉన్న పాఠశాలలను మోడల్, ప్రైమరీ పాఠశాలలుగా ఉంచాలన్నారు. 75 మంది విద్యార్థులు కంటే తక్కువ మంది ఉండే ఉన్నత పాఠశాలలలో హెచ్ఎం, పీడీ పోస్టులను తొలగించొద్దని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, నాయకులు నాతవరపు సతీష్, కృష్ణకిశోర్, రవి, ఆశ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన


డీటీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నక్కపల్లి: మండలంలో చందనాడ, తమ్మయ్యపేట, పాటిమీద, బోయపాడు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో బల్క్ డ్రగ్ పార్క్ కోసం సేకరించిన ప్రభుత్వ స్థలాల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, వీరికి కూడా ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, రైతు సంఘ నాయకుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వాసితులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ స్థలాలతోపాటు, ఇళ్లను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇటీవల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం విడుదల చేసిన జాబితాలో వీరి పేర్లు లేవన్నారు. నిరాశ్రయులవుతున్న వీరిని జాబితాలో చేర్చి ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, ఇంట్లో మేజర్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ మేరకు డీటీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, రైతు నాయకుడు తళ్ల అప్పలస్వామి పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేతపై రగడ

- కూటమి నేతల అండతో సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల దందా
- ఆయకట్టు రైతులు, గ్రామస్తులతో కలిసి అడ్డుకున్న పంచాయతీ సభ్యులు
- నరికిన చెట్ల విలువ రూ.20 లక్షలు?


సూరపురాజు చెరువులో నరికేసిన నేరేడు చెట్లు


యూకలిప్టస్ తోటలో రైతులు, సాగునీటి సంఘం, పంచాయతీ సభ్యులు

నక్కపల్లి: మండలంలోని గొటివాడ రెవెన్యూ పరిధి సూరపురాజు చెరువులో పెద్దఎత్తున నేరేడు, యూకలిప్టస్ చెట్లను నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. రెండు వారాలుగా జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గుర్తించిన గ్రామస్తులు, ఆయకట్టు రైతులతో కలిసి సాగు నీటి సంఘం, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గొటివాడ రెవెన్యూ పరిధి సర్వే నెం.16లో 42.32 ఎకరాల సూరపురాజు చెరువు ఉంది. ఈ చెరువుకు గొటివాడ గ్రామంతో పాటు శివారు గ్రామాలైన బొండవానిపాలెం, సాలాపువానిపాలేనికి చెందిన 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. మండలంలోనే రెండో అతిపెద్ద చెరువు. దీని చుట్టూ 30 ఏళ్ల వయసు పైబడిన భారీ నేరేడు చెట్లు, సుమారు 6 ఎకరాల వరకూ యూకలిప్టస్ తోట ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. కూటమికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, ఉపాధ్యక్షుడు బొండా శివరాం మిగిలిన పాలకవర్గ సభ్యులకు గాని, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా చెట్లను నరికి, రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు వారాలుగా ఎప్పుడు నరికిన చెట్లను అప్పుడే తరలించుకుపోతున్నారని పేర్కొన్నారు. దీంతో శుక్రవారం చెట్లు నరుకుతుండగా మాజీ ఎంపీటీసీ బొండా కళ్యాణ్‌రాజ్, ఉప సర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ విరోతి రామారావు, నీటి సంఘం డైరెక్టర్లు లగిశెట్టి సోమునాయుడు, లగిశెట్టి బంగారయ్య, లగిశెట్టి కుమార్, విరోతి అచ్చెంనాయుడు, విరోతి రామ్మూర్తి, లగిశెట్టి పెద అప్పారావు, విరోతి అప్పారావు తదితరులు ఆయకట్టు రైతులతో కలిసి అడ్డుకున్నారు. సుమారు 45 వరకూ నేరేడు చెట్లు, 6 ఎకరాల్లో యూకలిప్టస్ తోటను నరికి అప్పటికే తరలించుకుపోయినట్లు మీడియాకు తెలిపారు. తరలించుకుపోయిన చెట్ల విలువ రూ.20 లక్షల వరకూ ఉంటుందన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని, తహసీల్దార్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కూ ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఘటనా స్థలానికి వచ్చి నరికేసిన చెట్లను పరిశీలించారు. వివరాలు సేకరించారు.

దీనిపై సాగునీటి సంఘం చైర్మన్ సాలాపు సూరిబాబును వివరణ కోరగా 2016లోనే చెట్లను నరికివేసేందుకు ఆక్షన్‌వేసి రూ.2.50 లక్షలు ఇరిగేషన్ శాఖకు చలానా జమ చేసినట్లు తెలిపారు. అప్పట్లో ప్రస్తుత సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు బొండా శివరాం అడ్డుకుని కేసు వేయడంతో చెట్లు తీయడం జరగలేదన్నారు. సంవత్సరం క్రితం కోర్టులో కేసు డిస్మిస్ కావడంతో ప్రస్తుతం చెట్లు తీస్తున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 15 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.